క్లుప్తంగా

14న మండల సమావేశం

ప్రొద్దుటూరు : ప్రొద్దుటూరు మండల పరిషత్ కార్యాలయంలో ఈనెల 14న ఉదయం 10.30 గంటలకు మండల సర్వసభ్య సమావేశం నిర్వహించనున్నట్లు ఇన్‌చార్జి ఎంపీడీఓ కె.ఉపేంద్రారెడ్డి ఒక ప్రకటనలో తెలిపారు. ఎంపీపీ సానబోయిన శేఖర్ యాదవ్ అధ్యక్షతన నిర్వహించే ఈ సమావేశానికి ఎంపీటీసీ సభ్యులు, సర్పంచ్‌లు, మండల స్థాయి అధికారులు హాజరు కావాలని ఆయన కోరారు.

ఉచిత కంటి పరీక్షలు



కంటి పరీక్ష చేస్తున్న వైద్యులు

పోరుమామిళ్ల : స్థానిక గ్రామ పంచాయతీ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కంటి వైద్య శిబిరంలో 200 మందికి కంటి పరీక్షలు నిర్వహించారు. నంద్యాల శాంతిరామ్ మెడికల్ కాలేజీ జనరల్ ఆసుపత్రి వైద్య సిబ్బంది శిబిరంలో కంటి పరీక్షలు చేశారు. పరీక్షల అనంతరం కంటి శుక్లాలకు ఆపరేషన్ చేయుటకు ఎంపిక చేసిన వారిని ఆసుపత్రికి తీసుకెళ్లి ఆపరేషన్ చేస్తారని సర్పంచ్ సుధాకర్ తెలిపారు.

పోలింగ్ బూత్‌ల పరిశీలన



పోలింగ్ కేంద్రాలను పరిశీలిస్తున్న అధికారులు

దువ్వూరు : మండల కేంద్రంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో మార్చి 13న జరిగే పట్టభద్రుల, ఉపాధ్యాయ ఎమ్మెల్సీ ఎన్నికల కోసం పోలింగ్ బూత్‌లను ఏర్పాటు చేసేందుకు శుక్రవారం పాఠశాలను తహసీల్దార్ రామకుమారి పరిశీలించారు. ఈ సందర్భంగా తహసీల్దార్ మాట్లాడుతూ పట్టభద్రుల ఓటర్లకు ఒకటి, ఉపాధ్యాయులకు ఒక పోలింగ్ బూత్‌ను ఏర్పాటు చేసినట్లు తెలిపారు. మండలంలో ఉపాధ్యాయ ఓట్లు 61, పట్టభద్రుల ఓట్లు 1113 ఉన్నాయని చెప్పారు. ఈ కార్యక్రమంలో ఎంపీడీఓ జగదీశ్వరరెడ్డి, రెవెన్యూ సిబ్బంది పాల్గొన్నారు.

డొల్ల కంపెనీలతో ప్రజాధనం దారి మళ్లింపు

ప్రొద్దుటూరు : డొల్ల కంపెనీలతో ప్రజాధనం దారి మళ్లించిన ప్రధాని మోదీ చర్యలను నిరసిస్తూ శుక్రవారం స్థానిక ఎస్‌బీఐ మెయిన్ బ్రాంచి వద్ద సీపీఐ ఆధ్వర్యంలో నిరసన చేపట్టారు. సీపీఐ ఏరియా కార్యదర్శి పి.సుబ్బరాయుడు మాట్లాడుతూ డొల్ల కంపెనీల పేరుతో అదానికి ప్రధాని మోదీ బ్యాంకుల ద్వారా రుణాలు ఇప్పించారని ఆరోపించారు. కార్యక్రమంలో సీపీఐ జిల్లా సమితి సభ్యుడు డి.శివారెడ్డి, నాయకులు యేసోబ్, ప్రమీల, ప్రతాప్, వీరయ్య, ఇన్సాఫ్ జిల్లా కార్యదర్శి షరీఫ్, ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి వలరాజు, పట్టణ కార్యదర్శి శివకుమార్, అరుణ్‌తేజ పాల్గొన్నారు.

ప్రధాని హెచ్చరికలు కేంద్రానికి వర్తించవా

ప్రొద్దుటూరు క్రైం : రాష్ట్రాలు ఆర్థిక క్రమశిక్షణ పాటించాలని ప్రధానమంత్రి నరేంద్రమోదీ చేసిన హెచ్చరికలు కేంద్రానికి వర్తించవా అని ప్రొద్దుటూరు కాంగ్రెస్ పార్టీ ఇన్‌చార్జి పీఎండీ నజీర్ తెలిపారు. పార్టీ కార్యాలయంలో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ పార్లమెంట్ వేదికగా ప్రధానమంత్రి గురువారం రాష్ట్రాలు తీసుకున్న అప్పులపై వ్యాఖ్యలు చేశారన్నారు. ముందుగా కేంద్ర ప్రభుత్వ అప్పుల గురించి ప్రధాని మాట్లాడాలని తెలిపారు.

వాటర్ మోటార్ వితరణ

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక వైఎంఆర్ కాలనీలో నూతనంగా నిర్మిస్తున్న శ్రీఅవధూత కృష్ణయ్య స్వామి ఆలయానికి నందినీ క్లాత్ మార్కెట్‌లోని జింకా రెడీమేడ్, జింకా లెనిన్ హౌస్ అధినేతలు జింకా కిరణ్‌కుమార్, జింకా రాఘవ కిశోర్‌లు వాటర్ మోటార్‌ను వితరణగా అందించారు. రూ.25వేలు విలువల వాటర్ మోటార్‌ను ఆలయ కమిటీ అధ్యక్షుడు జింకా వేణుగోపాల్‌కు వారు శుక్రవారం ఇచ్చారు. ఈ సందర్భంగా వారిని ఆలయ కమిటీ అధ్యక్షుడు, సభ్యులు శాలువా కప్పి సన్మానించారు.

ముగిసిన వార్షికోత్సవాలు



విశేష అలంకరణలో పెద్దమ్మ తల్లి

మైదుకూరు : మైదుకూరులో గ్రామ దేవత పెద్దమ్మ తల్లి 24వ ప్రతిష్ట వార్షికోత్సవాలు శుక్రవారం ఘనంగా ముగిశాయి. పెద్ద సంఖ్యలో భక్తులు నిజరూపంలో ఉన్న అమ్మవారిని దర్శించుకుని పూజలు చేశారు.

కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలి

ప్రొద్దుటూరు : అమృతానగర్‌లో స్థలాల కబ్జాదారులపై చర్యలు తీసుకోవాలని సీపీఎం ఆధ్వర్యంలో శుక్రవారం తహసీల్దార్ కార్యాలయం వద్ద ధర్నా చేశారు. ఈ సందర్భంగా సీపీఎం పట్టణ కార్యదర్శి సత్యనారాయణ మాట్లాడుతూ అమృతానగర్‌లో పేదలకు ఇచ్చిన స్థలాలను కొందరు గ్రూపులుగా ఏర్పడి నకిలీ పట్టాలు తయారు చేసి కబ్జా చేస్తున్నారన్నారు. అనంతరం డిప్యూటీ తహసీల్దార్ మనోహర్‌రెడ్డికి వినతి పత్రం ఇచ్చారు.

అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలు

ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి



సంక్షేమ బావుట బుక్‌లెట్ ఇస్తున్న ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి

ప్రొద్దుటూరు : పార్టీలకతీతంగా అర్హత ఉన్న ప్రతి ఒక్కరికీ సంక్షేమ పథకాలను అందిస్తున్నామని ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి తెలిపారు. మండలంలోని కొత్తపల్లె గ్రామ పంచాయతీ పరిధిలో ఉన్న డీసీఎస్ఆర్ కాలనీలో సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి ఆధ్వర్యంలో శుక్రవారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే రాచమల్లు ఇంటింటికి తిరిగి సంక్షేమ పథకాలు అందుతున్నాయా లేదా అని ప్రజలను అడిగారు. సంక్షేమ పథకాల ద్వారా పొందిన లబ్ధిని వివరించారు. సీఎం వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సచివాలయ వ్యవస్థ ద్వారా మీ వద్దకు సుపరిపాలన తెచ్చారన్నారు. ఏ సమస్య ఉన్నా మీ ఇంటి సమీపంలో ఉన్న సచివాలయంలోకి వెళ్లి పరిష్కరించుకోవచ్చన్నారు. రోడ్లు, డ్రైనేజి కాలువలు నిర్మించాలని ప్రజలు ఎమ్మెల్యేకు విన్నవించారు. రోడ్లు, డ్రైనేజి కాలువలను నిర్మిస్తామని ఎమ్మెల్యే తెలిపారు. అలాగే టీచర్స్ కాలనీలో ఎమ్మెల్యే రాచమల్లు సతీమణి రాచమల్లు రమాదేవి గడపగడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొన్నారు. కార్యక్రమంలో మున్సిపల్ వైస్‌చైర్‌పర్సన్ భీమునిపల్లి లక్ష్మీదేవి నాగరాజు, సర్పంచ్ కొనిరెడ్డి శివచంద్రారెడ్డి, ఆప్కాబ్ చైర్‌పర్సన్ మల్లేల ఝాన్సీరాణి రాజారాంరెడ్డి, ఎంపీపీ శేఖర్ యాదవ్, టీటీడీ పాలకమండలి సభ్యుడు టంగుటూరు మారుతి ప్రసాద్, వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళరెడ్డి, ఎంపీటీసీ పేరం సునీత, వార్డు మెంబర్లు స్వాతి, లక్ష్మీనారాయణరెడ్డి, సుమలత, అరుణ కుమారి, తాటి లక్ష్మీదేవి, కౌన్సిలర్లు, సచివాలయ అధికారులు, వలంటీర్లు పాల్గొన్నారు.

నేడు మత్స్యకాలనీ, రాజేశ్వరి కాలనీలో..

మండలంలోని కొత్తపల్లె పంచాయతీ మత్స్యకాలనీలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి, రాజరాజేశ్వరి కాలనీలో ఎమ్మెల్యే సతీమణి రాచమల్లు రమాదేవి శనివారం గడప గడపకు మన ప్రభుత్వం కార్యక్రమంలో పాల్గొంటారని వైఎస్సార్‌సీపీ మండల కన్వీనర్ మార్తల ఓబుళ రెడ్డి తెలిపారు.

జాగరణ ఉద్యమ కరపత్రాలు విడుదల



కరపత్రాలు విడుదల చేస్తున్న జమాతే ఇస్లామీ హింద్ నాయకులు

ప్రొద్దుటూరు కల్చరల్ : స్థానిక జమాతే ఇస్లామీ హింద్ కార్యాలయంలో శుక్రవారం మానవత – నైతికత అనే నినాదంతో చేపట్టిన జాగరణ ఉద్యమ కరపత్రాలను విడుదల చేశారు. ఈ సందర్భంగా జమాతే ఇస్లామి హింద్ పట్టణాధ్యక్షుడు డీఎం షరీఫ్ మాట్లాడుతూ ఈనెల 11 నుంచి 20వ తేదీ వరకు జమా అతె ఇస్లామి హింద్ ఆధ్వర్యంలో మానవత-నైతికత అనే నినాదంతో జాగరణ ఉద్యమం నిర్వహిస్తున్నట్లు తెలిపారు. మనిషిలో నైతిక పరివర్తన కలిగినప్పుడే మానవతా విలువలు వికసిస్తాయని చెప్పారు. దైవభీతి, జవాబుదారితనం వల్లనే మనిషిలో నైతికత జనిస్తుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జమా అతె ఇస్లామి హింద్ పట్టణ నాయకులు పాల్గొన్నారు.

నేడు జాతీయ లోక్ అదాలత్

మైదుకూరు : పట్టణంలోని జూనియర్ సివిల్ జడ్జి కోర్టులో ఈనెల 11న శనివారం జాతీయ లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు న్యాయమూర్తి షేక్ ఖాజా మొయినుద్దీన్ శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. జాతీయ న్యాయ సేవా అధికార సంస్థ ఆధ్వర్యంలో రాష్ట్ర, జిల్లా న్యాయ సేవా అధికార సంస్థల సూచనల మేరకు లోక్ అదాలత్‌ను నిర్వహిస్తున్నట్లు ఆయన పేర్కొన్నారు. లోక్ అదాలత్‌లో రాజీ పడదగిన సివిల్, క్రిమినల్ కేసులను ఇరుపక్షాల అంగీకారంతో పరిష్కరిస్తామన్నారు. ఈ అవకాశాన్ని కక్షిదారులు సద్వినియోగం చేసుకోవాలని సూచించారు.

ట్రాఫిక్ నియంత్రణకు సీఐ ఫుట్ పెట్రోలింగ్



ఫుట్‌పెట్రోలింగ్ చేస్తున్న సీఐ సురేష్‌రెడ్డి

పోరుమామిళ్ల : పట్టణంలో రోడ్డు విస్తరణ పనులు జరుగుతున్న నేపథ్యంలో ప్రధాన రహదారిలో ట్రాఫిక్ జామ్ ఏర్పడి ఇబ్బందులు ఎదురవుతున్నాయి. ట్రాఫిక్ సమస్య ఎక్కువగా ఉండటంతో దాన్ని నియంత్రించేందుకు శుక్రవారం సాయంత్రం సీఐ సురేష్‌రెడ్డి ఫుట్ పెట్రోలింగ్ నిర్వహించారు. వాహనాలు నడిపే వారు తొందరపాటు లేకుండా, పాదచారులకు ఇబ్బందులు లేకుండా చూసుకోవాలన్నారు. విస్తరణ పనులు పూర్తయ్యేంతవరకు ట్రాఫిక్ సమస్య ఉంటుందని, అందరూ జాగ్రత్తగా వెళ్లాలన్నారు. రోడ్డుపై వాహనాలు నిలపరాదన్నారు.

కొర్రపాడులో అభివృద్ధి పనులు

రాజుపాళెం : మండలంలోని కొర్రపాడు గ్రామంలోని హరిజనవాడలో రూ.20 లక్షల నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శుక్రవారం భూమిపూజ చేశారు. మార్కెట్ యార్డు మాజీ వైస్ చైర్మన్, గ్రామ వైఎస్సార్‌సీపీ నాయకుడు దొంతిరెడ్డి సూర్యనారాయణరెడ్డి టెంకాయ కొట్టి పూజలు చేసి ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గతంలో గడపగడపకు మన ప్రభుత్వ కార్యక్రమంలో ఎమ్మెల్యే రాచమల్లు శివప్రసాదరెడ్డి ఇంటింటికి తిరిగారని, ఆ సందర్భంగా సీసీ రోడ్డు వేయాలని ఆ కాలనీ వాసులు అడిగిన మేరకు సీసీ రోడ్లు, మురికి కాలువలు వేస్తున్నామని ఆయన చెప్పారు. కార్యక్రమంలో ఇంజనీరింగ్ అసిస్టెంట్ నరసింహ స్వామి, కాంట్రాక్టర్ షరీఫ్, వర్క్ ఇన్‌స్పెక్టర్ పాల్గొన్నారు.

నాగాయపల్లెలో విగ్రహ ప్రతిష్ట వేడుక



నదిలో విగ్రహాలను జలాదివాసం చేస్తున్న వేద పండితులు

చాపాడు : మండలంలోని నాగాయపల్లె గ్రామంలో నూతనంగా నిర్మించిన శ్రీరామాలయ ప్రతిష్ట వేడుకలు శుక్రవారం ఘనంగా ప్రారంభమయ్యాయి. ఉదయం 7 గంటల నుంచి గోపూజ, గణపతి పూజ, ఇంకా పలు రకాలపై పూజలు, హోమాలు వేదిపండితులు నిర్వహించారు. సాయంత్రం గ్రామ సమీపంలోని గోడేరు నదిలో సీతారామలక్ష్మణ హనుమద్ విగ్రహాలను జలాదివాసం చేసి పూజలు నిర్వహించారు. శని, ఆదివారాల్లో ప్రతిష్ట వేడుకల్లో భాగంగా సీతారాముల కల్యాణం, న్యూ కేటగిరి వృషభరాజములచే బండలాగుడు పోటీలు నిర్వహిస్తున్నట్లు నిర్వాహకులు తెలిపారు.

గురువులపట్ల ప్రేమాభిమానాలు చూపాలి

పోరుమామిళ్ల : విద్యార్థులు గురువుల పట్ల, తల్లిదండ్రుల పట్ల గౌరవం, ప్రేమాభిమానాలు చూపాలని జిల్లా సమగ్ర శిక్ష పథకం అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకరరెడ్డి తెలిపారు. శుక్రవారం రామాయపల్లె ఎంపీపీ పాఠశాలను ఆయన సందర్శించి మాట్లాడారు. అనుకున్న లక్ష్యాన్ని చేరేందుకు విద్యార్థులు శ్రమించాలన్నారు. ఉన్నత శిఖరాలు చేరాక విద్యార్థి సంతకం ఓ ఆటోగ్రాఫ్ కావాలన్నారు. అనంతరం హెడ్మాస్టర్ శ్రీనివాసులు ప్రభాకర్‌రెడ్డిని సన్మానించారు. నాడు-నేడు పనులు పాఠశాలలో సంపూర్ణంగా పూర్తయ్యేందుకు ప్రభాకర్‌రెడ్డి సహకరించి, సూచనలు ఇచ్చారన్నారు. కార్యక్రమంలో ఎస్టీయూ జిల్లా అధ్యక్షుడు పి.రమణారెడ్డి, అధికారులు కరుణాకర్, యోగా టీచర్ బి.ఎస్.నారాయణరెడ్డి, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

సోషల్ మీడియాపై అవగాహన కల్పించాలి



వలంటీర్లకు అవగాహన కల్పిస్తున్న ఎస్ఐ హరిప్రసాద్

కాశినాయన : వాట్సాప్, ఇన్‌స్టాగ్రామ్, ఫేస్‌బుక్ వంటి సోషల్ మీడియాపై గ్రామాల్లోని ప్రజలకు అవగాహన కల్పించాలని నరసాపురం పోలీస్‌స్టేషన్‌లో వలంటీర్లకు శుక్రవారం నిర్వహించిన సమావేశంలో ఎస్ఐ హరిప్రసాద్ తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ గ్రామాల్లోని ప్రజలకు వీటి ద్వారా జరిగే మోసాలపై అప్రమత్తంగా ఉండే విధంగా వలంటీర్లు తెలియజేయాలన్నారు. వాట్సాప్ నెంబర్‌కు లింక్‌లు పంపి ఓటీపీ చెప్పమని అడిగితే తెలియని వారు ఓటీపీలు చెప్పడం వలన వ్యక్తిగత సమాచారం వారికి తెలిసి నష్టపోతారన్నారు. అలాగే వాహనదారులు తప్పనిసరిగా హెల్మెట్ ధరించే విధంగా సూచనలు ఇవ్వాలని తెలిపారు. సమావేశంలో సచివాలయాల మహిళా సంరక్షణ కార్యదర్శులు, వలంటీర్లు పాల్గొన్నారు.

మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశం



మాట్లాడుతున్న వీరనారాయణరెడ్డి

దువ్వూరు : మండల వ్యవసాయ సలహా కమిటీ సమావేశాన్ని శుక్రవారం మండల కేంద్రంలోని ఆర్బీకే కార్యాలయంలో చైర్మన్ చాగంరెడ్డి వీరనారాయణరెడ్డి అధ్యక్షతన నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ రబీ సీజన్‌లో రైతులు సాగు చేసిన పంటలను ఈక్రాప్ చేయించుకోవాలని తెలిపారు. ఈక్రాప్ నమోదుతో ఇన్‌పుట్ సబ్సిడీ, ఇన్సూరెన్స్ వర్తిస్తుందని వివరించారు. పీఎం కిసాన్, రైతు భరోసా పథకాలు పొందాలంటే తప్పనిసరిగా రైతులు ఈకేవైసీ చేయించుకోవాలని సూచించారు. ఈ కార్యక్రమంలో మండల వ్యవసాయాధికారి అమరనాథ్‌రెడ్డి, వ్యవసాయ కమిటీ సలహా మండలి సభ్యులు పాల్గొన్నారు.

పేదల సొంతింటి కలను నెరవేరుస్తున్న సీఎం



గృహప్రవేశంలో పాల్గొన్న మున్సిపల్ చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి

బద్వేలు అర్బన్ : పేదల సొంతింటి కలను ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి సాకారం చేస్తున్నారని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి అన్నారు. స్థానిక చెన్నంపల్లె జగనన్న కాలనీలో నూతనంగా ఇంటిని నిర్మించుకున్న చెన్నంపల్లెకు చెందిన అనిల్‌కుమార్ శుక్రవారం ఏర్పాటుచేసిన గృహప్రవేశం కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ఇంటిని ప్రారంభించారు. అనిల్‌కుమార్ మాట్లాడుతూ తన ఇంటి నిర్మాణం పూర్తయ్యేందుకు సహకరించిన ప్రభుత్వానికి, అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.

భక్తిశ్రద్ధలతో విశ్వాసుల ర్యాలీ



ప్రత్యేక అలంకరణలో తేరుపై లూర్దుమాత స్వరూపం

కడప కల్చరల్ : తొమ్మిదిరోజులుగా జరుగుతున్న లూర్దుమాత ఉత్సవాల్లో భాగంగా శుక్రవారం విశ్వాసులు భక్తిశ్రద్ధలతో ర్యాలీ నిర్వహించారు. కడప నగరం డాన్‌బాస్కో ఐటీఐ ఆవరణలోని చర్చిలో కడప విచారణ గురువులు, చర్చి ఇన్‌ఛార్జి ఫాదర్ జ్ఞాన ప్రకాశ్ సమిష్టి దివ్య బలిపూజ నిర్వహించారు. అనంతరం డాన్‌బాస్కో ఐటీసీ విద్యార్థుల ఆధ్వర్యంలో లూర్దుమాత తేరును రంగురంగుల పూలు, విద్యుత్ దీపాలతో అలంకరించారు. ఆమె స్వరూపాన్ని తేరులో ఏర్పాటు చేసి కడప నగరంలోని ప్రధాన వీధుల ద్వారా మరియాపురం పాత చర్చి వద్దకు ర్యాలీ నిర్వహించారు. ఊరేగింపులో విశ్వాసులు క్రైస్తవ భక్తిగీతాలు ఆలపించారు.

డ్రైడే పాటించాలి



ర్యాలీ నిర్వహిస్తున్న వైద్యసిబ్బంది

అట్లూరు : ప్రతి శుక్రవారం ఫ్రైడే, డ్రైడే కార్యక్రమాన్ని తప్పక పాటించాలని మండల వైద్యాధికారి విశ్వనాథ్ తెలిపారు. మండల పరిధిలోని గాండ్లపల్లి గ్రామంలో నిర్వహిస్తున్న కార్యక్రమాన్ని ఆయన శుక్రవారం పరిశీలించారు. ముందుగా ఇళ్లలోని నీటి నిల్వ చేసుకుంటున్న నీటి తొట్లు, డ్రమ్ములను శుభ్రం చేయించారు. అలాగే ప్రతి శుక్రవారం నీటి నిల్వ ఉన్న డ్రమ్ములను డ్రైగా ఉంచాలని సూచించారు. అనంతరం కుష్టువ్యాధిపై అవగాహన కల్పించడంతో పాటు ర్యాలీ నిర్వహించారు. ఈ కార్యక్రమంలో సీహెచ్ఓ మురళీకృష్ణ, డీపీఎంఓ లక్ష్మీనారాయణ, ఎస్ఈఓ సుబ్బరాయుడు, పీహెచ్ఎన్ లక్ష్మీదేవి, ఎంపీహెచ్ఎస్ వీరేంద్రనాథ్, స్టాఫ్‌నర్సు, ఏఎన్ఎం, వైద్యసిబ్బంది పాల్గొన్నారు.

అసాంఘిక కార్యకలాపాలకు దూరంగా ఉండాలి

ప్రొద్దుటూరు క్రైం : అసాంఘిక కార్యకలాపాల జోలికి వెళ్లొద్దని వన్‌టౌన్ సీఐ రాజారెడ్డి తెలిపారు. స్థానిక శివాలయం సెంటర్‌లో శుక్రవారం రాత్రి కడప పోలీసు కళాజాత కార్యక్రమాన్ని నిర్వహించారు. ఇందులో భాగంగా పరివర్తన నాటకాన్ని ప్రదర్శించారు. మట్కా, పేకాట, క్రికెట్ బెట్టింగ్ ఆడటం వల్ల కలిగే నష్టాలు, రోడ్డు ప్రమాదాల బారిన పడకుండా తీసుకోవాల్సిన జాగ్రత్తలను పాటలు, నాటకం ద్వారా వివరించారు. మట్కా, క్రికెట్ బెట్టింగ్ బారిన పడితే కుటుంబాలు రోడ్డున పడుతాయన్నారు. కార్యక్రమంలో సీఐలు ఇబ్రహీం, నారాయణయాదవ్, ఎస్ఐ రెడ్డిసురేష్ పాల్గొన్నారు.

స్పర్శ లేని మచ్చలుంటే వైద్య సిబ్బందిని కలవాలి

అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ



ప్రతిజ్ఞ చేస్తున్న దృశ్యం

చాపాడు : స్పర్శ లేని, రాగి రంగులో మచ్చలుంటే వెంటనే వైద్య సిబ్బందికి తెలియజేయాలని అడిషనల్ డీఎంహెచ్ఓ ఖాదర్‌వలీ పేర్కొన్నారు. లెప్రసీ వారోత్సవాలలో భాగంగా శుక్రవారం స్థానిక కస్తూర్బా గాంధీ బాలికల గురుకుల పాఠశాలలో వైద్యాధికారి రాజేష్ కుమార్ ఆధ్వర్యంలో విద్యార్థినులకు అవగాహన సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా అడిషనల్ డీఎంహెచ్ఓ మాట్లాడుతూ విద్యార్థులందరూ తమతో పాటు తమ పరిధిలోని ప్రజలకు ఎవరికైనా ఇలాంటి మచ్చలు ఉంటే తమ దృష్టికి తీసుకురావాలన్నారు. స్పర్శ లేని మచ్చల వలన కుష్టు వ్యాధి వ్యాపిస్తుందని ఇలాంటి మచ్చలను మొదట్లోనే గుర్తిస్తే తగిన చికిత్స అందిస్తామన్నారు. విద్యార్థులు పరిశుభ్రంగా ఉండాలని సూచించారు. అనంతరం విద్యార్థులు, ఉపాధ్యాయ సిబ్బంది, వైద్య సిబ్బందితో లెప్రసీ నిర్మూలనపై ప్రతిజ్ఞ చేయించారు. అనంతరం వంటశాలను పరిశీలించి చేతులకు గ్లౌజులు ధరించాలని పరిశుభ్రత పాటించాలని సూచించారు. పాఠశాలలో మరుగుదొడ్లను పరిశీలించి పలు రకాలైన సలహాలు సూచనలు చేశారు. కస్తూర్బా స్పెషలాఫీరు నాగలక్ష్మి, డాక్టర్ శ్రీవాణి, ఫిజియోథెరపీ డాక్టర్ మనోహర్, సీహెచ్ఓలు నాగన్న, రాముడు, సూపర్‌వైజర్ సరస్వతి, ఏఎన్ఎం స్రవంతి, ఆశలు పాల్గొన్నారు.

గెలుపునకు చురుకైన పాత్ర పోషించాలి



గృహసారథులకు కిట్లు పంపిణీ చేస్తున్న దృశ్యం

బద్వేలు అర్బన్ : రాష్ట్రంలో అమలవుతున్న సంక్షేమ అభివృద్ధి కార్యక్రమాలతో పాటు ప్రభుత్వం చేసిన మంచిని ప్రజలకు వివరిస్తూ రాబోవు ఎన్నికల్లో మళ్ళీ వైఎస్సార్‌సీపీని అధికారంలోకి తీసుకువచ్చేందుకు గృహసారథులు, సచివాలయ కన్వీనర్లు చురుకైన పాత్ర పోషించాలని మున్సిపల్ చైర్మన్ వాకమళ్ల రాజగోపాల్‌రెడ్డి, వైఎస్సార్‌సీపీ మున్సిపాలిటీ కన్వీనర్ ఈగయద్దారెడ్డిలు తెలిపారు. శుక్రవారం స్థానిక చెన్నంపల్లెలో కుమ్మరికొట్టాలు, తొట్టిగారిపల్లె సచివాలయాల పరిధిలోని గృహ సారథులు, సచివాలయ కన్వీనర్‌లకు మా నమ్మకం నువ్వే జగనన్న కిట్లు పంపిణీ చేసి మాట్లాడారు. ప్రతిపక్షాలు, ఎల్లో మీడియా ప్రభుత్వంపై చేస్తున్న దుష్ప్రచారాలను, బురదజల్లే కార్యక్రమాలను తిప్పికొట్టాలని పిలుపునిచ్చారు. పార్టీ కోసం కష్టపడ్డ ప్రతి ఒక్కరికీ గుర్తింపు, న్యాయం జరుగుతుందని అన్నారు. కార్యక్రమంలో ఆయా వార్డుల ఇన్‌చార్జిలు చెన్నకృష్ణారెడ్డి, వీరనారాయణరెడ్డి, రంగారెడ్డి, నారాయణరెడ్డి, చెన్నయ్య, ఓబులేసు, మురళి, రామచంద్రారెడ్డి, శ్రీను, సచివాలయ కన్వీనర్లు, గృహసారథులు తదితరులు పాల్గొన్నారు.

జామియా మసీదు ఆస్తులను పరిరక్షించాం

జామియా మసీదు మాజీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్

ప్రొద్దుటూరు క్రైం : 30 ఏళ్ల పాటు కమిటీ అధ్యక్షుడిగా ఉంటూ జామియా మసీదును అభివృద్ధి చేయడంతో పాటు వాటి ఆస్తులను పరిరక్షించినట్లు కమిటి మాజీ అధ్యక్షుడు బేపారి బషీర్ అహ్మద్ తెలిపారు. జామియా మసీదులో శుక్రవారం ఆయన విలేకరుల సమావేశంలో మాట్లాడుతూ జిల్లా వక్ఫ్‌బోర్డు గత నెలలోనే మసీదు నిర్వహణ బాధ్యతలను తీసుకున్నట్లు తెలిపారు. పట్టణానికి చెందిన ఖాజామొహిద్దీన్‌తో పాటు కొందరు వ్యక్తులు జామియా మసీదు ఆస్తులకు సంబంధించి తమపై ఆరోపణలు చేశారన్నారు. మసీదు ఆస్తులను కాజేసేందుకే మాపై కొందరు వ్యక్తులు ఆరోపణలు చేస్తున్నారని బేపారి జాకీర్ తెలిపారు. సమావేశంలో అబ్దుల్‌మాలిక్, సనావుల్లా, పసపుల దస్తగిరిబాషా, ముల్లా నసిరుద్దీన్, గౌస్‌బాషా పాల్గొన్నారు.

విద్య ఉన్నత శిఖరాలకు మార్గం



వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న అంబవరం ప్రభాకర్‌రెడ్డి

కాశినాయన : విద్య ఉన్నత శిఖరాలకు మార్గమని జిల్లా సమగ్రశిక్ష పథక అధికారి డాక్టర్ అంబవరం ప్రభాకర్‌రెడ్డి అన్నారు. శుక్రవారం మండలంలోని వరికుంట్ల కస్తూర్బాగాంధీ పాఠశాల, నరసాపురం మోడల్ పాఠశాల, నరసాపురం జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల, గొంటువారిపల్లె ప్రాథమికోన్నత పాఠశాలలను ఆయన సందర్శించి మాట్లాడారు. పదవ తరగతి, ఇంటర్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించాలన్నారు. అలాగే నాడు-నేడు పనులను పరిశీలించారు. కస్తూర్బాగాంధీ పాఠశాలలో జగనన్న గోరుముద్దను పరిశీలించారు. అనంతరం నరసాపురం ఎమ్మార్సీ భవనాన్ని పరిశీలించి సిబ్బందికి తగు సూచనలిచ్చారు. కార్యక్రమంలో ఏఎల్ఎస్ఓ దశరధరామిరెడ్డి, సీఆర్‌పీలు, ఆయా పాఠశాలల ప్రధానోపాధ్యాయులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

వైభవంగా ఆలయ వార్షికోత్సవం



స్వామికి క్షీరాభిషేకం చేస్తున్న దృశ్యం

పోరుమామిళ్ల : పట్టణంలోని శ్రీ లక్ష్మీవేంకటేశ్వర స్వామి ఆలయం 11వ వార్షికోత్సవం శుక్రవారం వైభవంగా నిర్వహించారు. ఉదయం సుప్రభాత సేవ, విశ్వక్సేన, మహాగణపతిపూజ అనంతరం అభిషేక కార్యక్రమాలు నిర్వహించారు. ఉత్సవమూర్తులకు పంచామృతాభిషేకం అనంతరం స్వామివారికి భక్తులచేతుల మీదుగా క్షీరాభిషేకం జరిగింది. మధ్యాహ్నం శ్రీదేవి భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వరస్వామి వార్లకు స్వర్ణరత్నప్రభ అలంకారం నిర్వహించారు. సాయంత్రం జరిగిన గుడి ఉత్సవంలో భక్తులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

కుష్టు వ్యాధిగ్రస్తులను ఆదరించాలి

ప్రొద్దుటూరు క్రైం : కుష్టు వ్యాధిగ్రస్తులను ప్రేమతో ఆదరించాలని అడిషనల్ డీఎంహెచ్ఓ డాక్టర్ ఖాదర్‌వలి తెలిపారు. కుష్టువ్యాధి పక్షోత్సవాల్లో భాగంగా శుక్రవారం లైట్‌పాళెంలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో కుష్టువ్యాధిపై మిడ్‌టౌన్ రోటరీ క్లబ్, వైద్య ఆరోగ్యశాఖ ఆధ్వర్యంలో కుష్టువ్యాధిపై అవగాహన కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా డాక్టర్ ఖాదర్‌వలి మాట్లాడుతూ కుష్టువ్యాధి రహిత సమాజం కోసం పోరాడుదామన్నారు. అనంతరం 25 మంది వ్యాధిగ్రస్తులకు మిడ్‌టౌన్ రోటరీ క్లబ్ సహకారంతో దుప్పట్లు, పండ్లను పంపిణీ చేశారు. కార్యక్రమంలో జిల్లా పారామెడికల్ అధికారి నాగన్న, ఫిజియోథెరపిస్టు విక్టర్ మనోహర్, డీపీఎంఓ శివశంకరయ్య, యూపీహెచ్‌సీ వైద్యాధికారి షాహిన్‌సుల్తానా, మిడ్‌టౌన్ రోటరీ ప్రెసిడెంట్ తిరుపతయ్య, వైస్ ప్రెసిడెంట్ జగదీష్, ట్రెజరర్ సాధుశివనారాయణ, రిటైర్డ్ ఎమ్మార్వో తుకారం, శ్రీనివాసులు, సీఓలు శ్రీదేవి, ఎంపీ సుబ్బారెడ్డి, యూపీహెచ్‌సీ సిబ్బంది పాల్గొన్నారు.